సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



సంరక్షణతో పశు సంపద


ఉదయం లేచింది మొదలు, రాత్రయ్యే వరకూ పాలు, టీ, కాఫీలంటూ తీసుకునే వారెందరో.. అలాంటి పాల ఉత్పత్తులు కావాలంటే పాడి పరిశ్రమ ఎంతో ఆధారం.



అలరించిన బాలోత్సవం

విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు.

8లో



మిగులు జలాలు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం సాయంత్రం 5,03,702 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 7.90 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 5500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

సినిమా చెట్టుకు చురుగ్గా పునరుజ్జీవ పనులు



కుమారదేవంలో నిద్ర గన్నేరు చెట్టుకు సాగుతున్న పునరుజ్జీవ పనులు

కొవ్వూరు: కుమారదేవంలో సినిమా చెట్టుగా ప్రసిద్ధి చెందిన నిద్రగన్నేరు చెట్టుకు పునరుజ్జీవ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం చెట్టుకి బరువుగా ఉన్న మూడు కొమ్మలను కత్తిరించే పనులు చేస్తు న్నారు. రోటరీక్లబ్ చెట్టు పునరుద్ధరణ ఇన్‌చార్జి రేఖపల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చెట్టు మానుకి ఏ విధమైన నష్టం జరగకుండా ప్రత్యేకంగా తయారు చేసిన లేపనాలు పూసి కప్పి ఉంచుతున్నాం. వారం రోజుల తరువాత రెండుగా విడిపోయిన మానును దగ్గరకు చేర్చే పనులు చేపడతాం. చెట్టు ప్రాధాన్యాన్ని బట్టి సందర్శకులు భారీగా వచ్చి చూసి వెళ్తున్నారు. ప్రముఖ సినీ దర్శకుడు వంశీ రావడం, కలెక్టర్ పి.ప్రశాంతితో పాటు అటవీశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు నిత్యం ఇక్కడికి వస్తుండడంతో రద్దీ నెలకొంది.

15 నుంచి బీజేపీ వారధి ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, కేంద్ర రాష్ట మంత్రులు వారధి కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించేందుకు ఒక్కక్కరూ నెలలో రెండు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ప్రతి నెలలో మొదటి సోమవారం, మూడో సోమవారం అందుబాటులో ఉంటారని, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రతి నెలలో నాలుగో సోమవారం, మంగళవారం అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

'గోదావరి'కి పూర్వ వైభవం తేవాలి



రైల్వే ఎస్ఎస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి రైల్వే స్టేషన్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని గోదావరి రైల్వే స్టేషన్ సలహా మండలి సభ్యులు స్టేషన్ సూపరింటెండెంట్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. గత పదేళ్లుగా రైళ్ల రాకపోకలు తగ్గించడం వల్ల దీని ఉనికి మరుగునపడే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. స్టేషన్‌లో లైటింగ్ వ్యవస్థ లేకపోవడం వలన రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని, విజయవాడ నుంచి వచ్చే రైళ్లకు హాల్ట్ ఇవ్వకపోవడం వల్ల స్థానిక వర్తకుల వ్యాపారాలు డీలా పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సలహామండలి సభ్యులు కారుమూరి సురేష్, పైబోయిన సురేంద్ర, కే.శ్రీనివాస్, తంగెళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బార్జి లోడింగ్ అన్ లోడింగ్ నిలిపివేత!

కాకినాడ రూరల్: కాకినాడ పోర్టులో బియ్యం బార్జి లోడింగ్ అన్ లోడింగ్‌లో జాప్యం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, దీనిపై చాంబర్, సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే సోమవారం నుంచి లోడింగ్ అన్ లోడింగ్ నిలిపివేస్తామని ఎక్స్‌పోర్టు అండ్ ఇంపోర్టు షోర్ లాబర్ యూనియన్ ప్రెసిడెంట్ తలాటం వీరభద్రరావు (వీరబాబు) తెలియజేశారు. ఈ మేరకు కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌కు శనివారం లేఖ రాసి పోర్టులో కార్యకలాపాలు తెలియజేశారు. కాకినాడ పోర్టు నుంచి బియ్యంతో పాటు పీడీఎస్ రైస్ ఎగుమతి అవుతున్నాయని భావించి పోర్టు ప్రాంతంలో బొంబాయి కాటా వద్ద ఇటీవల చెక్ పోస్టు ఏర్పాటు చేశారని, విధాన పరంగా ప్రభుత్వం నిర్ణయం మంచిదే అయినా కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఒక బార్జి లోడింగ్ అన్ లోడింగ్‌కు ఇది వరకు నాలుగు నుంచి ఐదు గంటలు పట్టేదని, మారిన పరిస్థితులతో మూడు నుంచి నాలుగు రోజులు పడుతోందన్నారు. ఒక్కరోజు రావల్సిన డబ్బులను నాలుగు రోజులకు పంచుకోవలసి రావడంతో తమ కార్మికులు నష్టపోతున్నారని, ఇదే కొనసాగితే కూలి గిట్టుబాటు కాక బార్జి లోడింగ్ పనులు నిలిపివేస్తామన్నారు. దీనిపై తగు న్యాయం చేయాలని కోరుతున్నట్టు వీరబాబు తెలియజేశారు.

ఉత్తరానికో దక్షిణ!

- ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- వసూళ్లకు తెరతీసిన కూటమి నేతలు
- అమాత్యుల లేఖల కోసం ఆశావహుల ప్రదక్షిణలు
- పోస్టును బట్టి సాగుతున్న పందేరం



సాక్షి, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు వసూళ్లే ప్రామాణికంగా పావులు కదుపుతున్నారు. ఇందుకు అందివచ్చిన ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. అధికార పగ్గాలు చేపట్టిన నెల రోజుల్లోపే ఇసుక గుట్టలను కరిగించి రూ.కోట్లు కొల్లగొట్టారు. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలపై కూటమి నేతలు కన్నేశారు. సీఎం చంద్రబాబు అన్ని శాఖల్లో అధికారులకు స్థానచలనం కల్పించాలని ఆదేశించారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నేతలు అక్రమాలకు గేట్లు ఎత్తేశారు. స్వీపర్ నుంచి సీఐ పోస్టు వరకు ఏ చిన్న ఉద్యోగి బదిలీ అయినా ఎమ్మెల్యేల సిఫార్సు లేఖ లేనిదే కదలనివ్వడం లేదు. ఏదో లెటరే కదా తీసుకుంటే పోతుందిలే అనుకుంటే పొరబాటే. లేటరులో రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిఫార్సు లేని పక్షంలో ఒక్క అడుగు కూడా కదలని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నడూ లేని సంస్కృతికి నాంది పలకడంతో ఉద్యోగుల్లో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి తలెత్తింది.

రూ.లక్షలు కొట్టు.. కోరుకున్న స్థానం పట్టు

బదిలీ సిఫార్సు లేఖలు రూ.లక్షలు పలుకుతున్నాయి. అమ్యామ్యాలు సమర్పిస్తే చాలు తాను కోరుకున్న స్థానానికి పంపుతున్నారు. లేదంటే మాత్రం లూప్‌లైన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆదాయం బాగా వచ్చే స్థానాలకు మరింత డిమాండ్ ఏర్పడింది. కీలక శాఖలైన రెవెన్యూ, పోలీసు శాఖల్లో ఈ తంతు యథేచ్ఛగా నడిచింది. ఇప్పటికే రూ.లక్షలు సమర్పించుకుని కొందరు పోస్టింగ్‌లు, బదిలీలు తెచ్చుకున్నట్లు సమాచారం.

రెడ్‌బుక్‌లో పేరుంటే పోస్టింగ్ లేనట్లే..!

పోలీసు, ఇతర శాఖల బదిలీల్లో ప్రభుత్వం కొత్త సంస్కృతికి శ్రీకారం చుట్టింది. లోకేష్ రెడ్‌బుక్‌లో పేరు నమోదైన అధికారులకు పోస్టింగ్ ఇవ్వకుండా కట్టడి చేస్తోంది. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చిన వెంటనే పోలీసు శాఖలో అయితే ముగ్గురు విశ్రాంత ఐపీఎస్‌లతో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీకి వెళ్తుంది. కమిటీ ఫైనల్ చేసిన జాబితాలో ఉన్న వారికే బదిలీలు ఉంటున్నాయి. ఇప్పటికే కొందరు సీఐ, ఎస్సైల బదిలీలు పూర్తయ్యాయి. మరికొన్నింటికి 'చినబాబు' ఆమోద ముద్ర కోసం పంపినట్లు సమాచారం. ఆయన ఓకే అంటే హోంశాఖ బదిలీల ప్రక్రియ చేపడుతుంది. ఇప్పటికే జాబితా కొలిక్కి వచ్చిందని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మచ్చుకు కొన్ని పరిశీలిస్తే..

- పోలీసు శాఖలో ఇటీవల సీఐ, ఎస్సై బదిలీలు జరిగాయి. తమ అడుగులకు మడుగులొత్తే అధికారులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పోస్టింగ్‌లు వేయించుకున్నారు. త్వరలో మరింత మందికి స్థానచలనం కలిగే సూచనలు ఉండటంతో ఇప్పటి నుంచే పోస్టింగ్‌ల కోసం పావులు కదుపుతున్నారు.
- రాజమండ్రి నగరంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ అత్యంత ఖరీదైన ప్రాంతం కావడం, జీతం కంటే గీతం ఎక్కువగా వస్తుండటంతో ఈ సీటు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు పలికినట్లు సమాచారం. ఓ టీడీపీ నేత దగ్గరుండి వ్యవహారం చక్కబెడుతున్నట్లు తెలిసింది.
- రాజమండ్రి రూరల్, కడియం, బొమ్మూరు సీఐ, ఎస్సై పోస్టులకు సైతం అత్యంత డిమాండ్ నెలకొన్నట్లు తెలిసింది. ఇక్కడ పోస్టింగ్‌కు సీఐ రూ.15 లక్షలు, ఎస్సైలకు రూ.5 లక్షలకు పైగా ధర పలుకుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు లేనిదే పోస్టింగ్‌లకు అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు అధికారులు క్యూ కడుతున్నారు. సిఫార్సు లేఖలు ఇచ్చేందుకు సదరు నేతలు రూ.లక్షలు దండుకుంటున్నారు. ఇందుకు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా ఓ పీఏను నియమించుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే వరకు వెళ్లకుండా పీఏలే వ్యవహారం మొత్తం చక్కబెట్టేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.
- ఇటీవల రాజానగరం నియోజకవర్గంలో సీఐ పోస్టు కోసం స్థానిక ఎమ్మెల్యేని సంప్రదించకుండా ఓ అధికారి నేరుగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పీఏ నుంచి సిఫార్సు లేఖ తీసుకురావడంతో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అవాక్కైన సందర్భాలు లేకపోలేదు.

ముగిసిన తహసీల్దార్ల నియామకం

సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన నెలలోపే తహసీల్దార్ల బదిలీలు జరుగుతుంటాయి. గతం నుంచి ఇదే సంస్కృతి అమలవుతోంది. కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. బదిలీలకే రెండు నెలల సమయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణ కోసం నిబంధనల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లను వెనక్కు పంపేశారు. ఇతర జిల్లాలకు వెళ్లిన వారు తూర్పుగోదావరి జిల్లాకు నియమించేందుకు ఎడతెగని జాప్యం జరిగింది. దీంతో పరిపాలనా సౌలభ్యం కోసం ఇన్‌చార్జి తహసీల్దార్లకు బాధ్యతలు అప్పగించారు. వారితో అజమాయిషీలో ప్రజా సమస్యల పరిష్కారం ఇబ్బందికరంగా మారడంతో స్పందించిన కలెక్టర్ ఇతర జిల్లాల నుంచి వెనక్కు వచ్చిన తహసీల్దార్లకు ఇటీవల మండలాలు కేటాయించింది. నేటికీ కొంత మంది ఉద్యోగంలో చేరిన దాఖలాలేవు. తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లేందుకు ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందు కోసం భారీగా నజరానా ముట్టజెపుతున్నట్లు తెలిసింది. జిల్లాలో 17 మంది తహసీల్దార్లకు మండలాలు కేటాయిస్తే చేరిన వారి సంఖ్య మాత్రం తక్కువగానే ఉంది.

లైన్‌మెన్‌లకు పదోన్నతులు కల్పించాలి



పసలపూడిలో డిమాండ్ల సాధనకు నినదిస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులు

రాయవరం: జూనియర్ లైన్‌మేన్ గ్రేడ్-2 ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం పసలపూడిలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులను మాతృ సంస్థకు పంపిస్తున్నందున జూనియర్ లైన్‌మేన్ గ్రేడ్-2 ఉద్యోగులను ఏపీ ఈపీడీసీఎల్‌లో అనుసంధానం చేయాలన్నారు. సచివాలయ వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్లుగా నియమితులైన తమను జూనియర్ లైన్‌మేన్‌లుగా గుర్తించాలన్నారు. 2021 అక్టోబర్ 2 నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన జేఎల్ఎంలను 2022 జూలై 1న ప్రొబేషన్ డిక్లేర్ చేసినందున 9 నెలల సర్వీసును కోల్పోతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలల సర్వీసును ప్రొబేషన్ కలపాలని వారు కోరారు. అలాగే ఇతర జిల్లాల్లో, డివిజన్లతో ఉన్న జేఎల్ఎం గ్రేడ్-2లకు కూడా బదిలీలు కల్పించాలని, పదోన్నతి ఛానల్ వర్తింపజేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.తాతాజీ, ఉపాధ్యక్షుడు కె.వీరబాబు, ప్రధాన కార్యదర్శి జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న చాగంటి దంపతులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లిని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ఆ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

స్మృతివనంపై దాడికి నిరసన



గోపాలపురంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



రాజానగరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న సీజీసీ సభ్యురాలు విజయలక్ష్మి తదితరులు

- కొవ్వొత్తుల ర్యాలీ చేసిన నాయకులు
- దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

గోపాలపురం/తాళ్లపూడి/రాజానగరం/మధురపూడి: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర మాజీ హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. దీనికి నిరసనగా శనివారం గోపాలపురం వైఎస్సార్ విగ్రహం వద్ద కొవ్వత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. శిలాఫలకంపై జగన్‌మోహన్‌రెడ్డి పేరునైతే పాడు చేశారు కానీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉన్న ముద్రను తొలగించలేరని ఆమె పేర్కొన్నారు. అలాగే తాళ్లపూడిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో స్థానిక బజార్ సెంటర్ మీదుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజానగరం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, స్థానిక నాయకులు శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. రాజమహేంద్రవరంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ క్వారీ జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. అలాగే సీతానగరం ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

అందరికీ అందుబాటులో ఇసుక

- రవాణా ఖర్చులు వినియోగదారునివే
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్



సమావేశంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమలు చేస్తున్న దృష్ట్యా వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుని వెళ్లే బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక సరఫరా విధానంపై ఆయన సమీక్షించారు. సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 47 లక్షల మెట్రిక్ టన్నులు స్టాక్ పాయింట్ వద్ద, 71 లక్షల మెట్రిక్ టన్నులు డీసిల్టేషన్ పాయింట్ ఉచిత ఇసుక అందుబాటులో ఉంచామన్నారు. ఇసుక పాలసీపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాల్సి ఉందన్నారు. నిర్మాణ రంగం, ఆ రంగంపై ఆధారపడిన వారి జీవన భృతి దృష్టిలో ఉంచుకుని నూతన పాలసీని రూపొందించామన్నారు. లారీ అసోసియేషన్ సమస్యను పరిష్కరిస్తామని అందుకు రెండు నెలలు ఓపికపట్టాలని కోరారు. తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాల నుంచి ఇసుకకు భారీగా డిమాండు ఉన్నట్టు గుర్తించామని, నిర్ణయించిన ధరలకు ఇసుకను అందజేస్తామని, స్టాక్ పాయింట్ల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మైనింగ్ శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామని, త్వరలో మరో 11 రీచ్‌లను అందుబాటులోకి తీసుకువస్తామరు. శాఖల మధ్య సమన్వయం అవసరమని ఆయన అన్నారు. అలాగే అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీని అమలులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, మైన్స్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అక్టోబర్ 1వ తేదీ వరుకు పాత మద్యం పాలసీ గడువు ఉన్నందున అనంతరం నూతన మద్యం పాలసీని తీసుకు వస్తున్నామన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పేదలకు, ఇళ్ల నిర్మించుకునే వారికి ఇసుక అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు తీరు, డీఎల్ఎస్ఏలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. సమర్థవంతంగా ఇసుక రవాణా చేసేందుకు మూడు బృందాల అధ్వర్యంలో రిజిస్ట్రేషన్, లోడింగ్, విజిలెన్స్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఇసుక రీచ్ మేనేజర్గా, ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే రవాణాను అనుమతిస్తున్నట్లు తెలియచేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనధికారికంగా ఇసుక తరలించిన వారి నుంచి రూ.8.82 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. 14 కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. ఇరిగేషన్ ద్వారా 17 డిసిల్టేషన్ పాయింట్లు గుర్తించామని తద్వారా 1.83 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత అవుతుందని అన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలకు కేటాయింపుల కోసం టెండర్ పిలవాలని జిల్లా స్థాయి కమిటీలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ, ఆదిరెడ్డి వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శనానికి ఆంక్షలు

- మధ్యాహ్నం 3 తరువాతే ప్రదక్షిణ దర్శనం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు
- రూ.300 టికెట్‌తో నిత్యం రూ.3 లక్షల ఆదాయం
- ఈ ఆదాయానికి గండి పడుతున్నా చర్యలు శూన్యం

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రదక్షిణ ఓ ప్రహసనంలా మారింది. భక్తుల రద్దీని నియంత్రించే పేరుతో మధ్యాహ్నం మూడు గంటల తరువాత మాత్రమే ప్రదక్షిణ దర్శనానికి అనుమతిస్తున్నారు. రూ.300 టిక్కెట్‌తో రెండు నెలల క్రితం వరకు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించేవారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రోజుకు రూ.మూడు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రతి నెలా రూ.80 లక్షల నుంచి రూ. కోటి వరకు ఈ దర్శనం టిక్కెట్ల ద్వారా వచ్చేది. ప్రస్తుతం ఈ ప్రదక్షిణ దర్శనంపై ఆంక్షలతో ఆ ఆదాయానికి భారీగా గండి పడింది.

దీనిపై పరిశీలిస్తాం

> గతంలో ఉన్న విధంగా ఉదయం నుంచి రాత్రి వరకు సత్యదేవుని ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించే విషయమై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
>
> – ఇన్‌చార్జి ఈఓ. రమేష్ బాబు

ప్రస్తుతం అంతరాలయం దర్శనం పేరుతో రూ.200 టిక్కెట్ మీద లోపలకు పంపుతున్నా భక్తులు సంతృప్తి చెందడం లేదు. గతంలో రూ.300 టిక్కెట్‌తో ప్రదక్షిణ దర్శనం చేసుకునే భక్తుల్లో ఇప్పుడు సగం మంది కూడా రూ.200 టిక్కెట్‌తో అంతరాలయం దర్శనం చేసుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం ఉచిత దర్శనానికి అంతరాలయం దర్శనానికి పెద్ద తేడా లేకపోవడమే.

కాగా, రెండు నెలల క్రితం ఆలయానికి వచ్చి రూ.300 టిక్కెట్లు తో గర్భాలయం చుట్టూ ప్రదక్షిణ దర్శనం చేసుకున్న భక్తులు ఇప్పుడు మళ్లీ ఆలయానికి వచ్చినపుడు ప్రదక్షిణ దర్శనం ఎందుకు నిలిపివేశారని ప్రశ్నిస్తూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆంక్షల వల్ ఆదాయం కోల్పోతున్న విషయం తెలిసినా అధికారుల మీద భయంతో ఎవరూ నోరు మెదపడం లేదు.



సత్యదేవుని దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

గత ఏడాది విజయదశమి నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ దర్శనం

గత ఏడాది విజయదశమి నుంచి సత్యదేవుని ఆలయంలో గర్భాలయ దర్శనం ప్రారంభమైంది. అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఈ దర్శనాన్ని ఏర్పాటు చేశారు. ఆయన కోరిక మేరకు ప్రముఖ పారిశ్రామికవేత్త, దానవాయిపేటకు చెందిన హేచరీస్ అధినేత చినబాబు రూ.25 లక్షల వ్యయంతో ప్రదక్షిణ దర్శనం మార్గంలో నాలుగు దిక్కులా బంగారు పూత కలిగిన శ్రీగంధం గిన్నె, లక్ష్మీ హుండీ, కల్పవృక్షం, కామధేనువులను ఏర్పాటు చేశారు. భక్తులు వీటిని దర్శిస్తూ ప్రదక్షిణగా స్వామివారి అంతరాలయంలోకి ప్రవేశించి స్వామిని దర్శించుకునే వీలు కల్పించారు. ప్రస్తుతం ఈ దర్శనాలు నిలిపివేయడంతో అవి ఏర్పాటు చేసిన దాతల ఆశయం నెరవేరడం లేదు. దానికి తోడు ప్రదక్షిణ దర్శనం మార్గంలో ఏసీలు, ప్రత్యేక దీపాలు ఏర్పాటు చేయడంతో ఎంతసేపు ఆలయంలో ఉన్నా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండడంతో ఈ దర్శనానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.


భక్తులు ఎవరూ లేని సమయంలో అనుమతి

సాధారణంగా సత్యదేవుని ఆలయంలో భక్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే ఉంటారు. ఆ తరువాత భక్తులు పెద్దగా ఉండరు. కానీ ప్రదక్షిణ దర్శనానికి మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి మాత్రమే భక్తులను అనుమతించాలని ఈఓ కె.రామచంద్ర మోహన్ ఆదేశించారు. కార్తీకమాసం, దశమి, ఏకాదశి, శనివారం వంటి రోజుల్లోనే ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఉంటారు. అయితే ఆ రోజుల్లో అసలు ప్రత్యేక దర్శనానికి అనుమతి ఇవ్వడం లేదు. దీంతో భక్తుల అసంతృప్తితో బాటు దేవుని ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రదక్షిణ దర్శనానికి భక్తులను అనుమతించాలని కోరుతున్నారు.









ప్రదక్షిణ మార్గంలో ఏర్పాటు చేసిన గంధపు గిన్నె, లక్ష్మీదేవి హుండీ, కామధేనువు, కల్పవృక్షం

సంరక్షణతో పశు సంపద

● పెంపకంలో జాగ్రత్తలు అవసరం
● తద్వారా అధిక ఆదాయం

కొత్తపేట: ఉదయం లేచింది మొదలు, రాత్రయ్యే వరకూ పాలు, టీ, కాఫీలంటూ తీసుకునే వారెందరో.. అలాంటి పాల ఉత్పత్తులు కావాలంటే పాడి పరిశ్రమ ఎంతో ఆధారం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పాడి పరిశ్రమ ఎందరో రైతులకు జీవనోధారం అయ్యింది. ఒకపక్క వ్యవసాయంతో పాటు అనుబంధంగా పశు సంపదతో ఆర్థికాభివృద్ధి సాధించే వారు. కాలక్రమేణా నిర్వహణ భారమై పశు పోషణ తగ్గించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయం, పాడి పరిశ్రమ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఆయా రంగాల వైపు రైతులను మళ్లించేందుకు ప్రోత్సాహక పథకాలు అమలు చేసింది. ప్రధానంగా పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ప్రోత్సహించింది. దానితో పాడి రైతుల్లో పరిశ్రమ పట్ల ఆసక్తి పెరిగింది. దానికనుగుణంగానే ప్రస్తుతం పాల ఉత్పత్తులకు డిమాండ్ బాగా పెరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పశువులు 1,60,403 గేదెలు, 75,839 ఆవులు పెంచుతున్నారు. జిల్లాలో పాల సేకరణ కేంద్రాలు 139, బల్క్‌మిల్క్ సెంటర్లు 5 ఉన్నాయి. నిత్యం 7,797 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. పశువుల సంరక్షణ ద్వారా అధిక పాల ఉత్పత్తి, పాలు తీసే సమయంలో మెళకువలు, వాటిని కేంద్రాలకు, వినియోగదారులకు తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తద్వారా ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, రావులపాలెం ప్రాంతీయ పశువైద్యాధికారి ఎస్.మహేశ్వరరెడ్డి వివరించారు.



గేదె నుంచి పాలు తీస్తున్న పాడి రైతు

సంరక్షణ.. జాగ్రత్తలు

- నిత్యం పాడి పశువులకు పచ్చి, ఎండు గడ్డితో పాటు పోషకాలతో కూడిన దాణా అందించాలి. తగినంత నీరు తాగించాలి.
- పశువులకు దోమలు కుట్టకుండా సంరక్షించాలి. సౌకర్యవంతంగా పశు శాలను ఏర్పాటు చేయాలి.
- గేదె ఈనిన 15 రోజుల వరకూ పాల కేంద్రాలకు పాలను వేయరాదు. జున్ను పాలు కలిస్తే మంచి పాలు కూడా పాడైపోతాయి.
- పాలు తీయడానికి ముందు నేలను ఊడ్చి నీటితో కడగాలి. చుట్టుపక్కల బురద, పేడ కుప్పలు ఉండరాదు.
- పాలు తీసే ముందు పాడి పశువును గోరువెచ్చని నీటితో కడగాలి. పొదుగును శుభ్రం చేయాలి. అలా కుదరకపోతే పొదుగును కడిగి పొడి వస్త్రంతో తుడవాలి.
- పాలు తీసే వ్యక్తి చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తడి చేతులతో పాలు పితకరాదు.
- ముందు తీసిన పాలలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి, వెన్న శాతం తక్కువగా ఉంటుంది. కాబట్టి ముందు పాలను దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.
- పాలు వేయడానికి స్టీలు, అల్యూమినియం పాత్రలనే వాడాలి.
- నీళ్లు కలపడం వల్ల పాలలో వెన్న శాతంతో పాటు మిగిలిన ఘన పదార్థాలు తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది.
- పాలు చుట్టుపక్కల వాసనను వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపలు, మురుగు నీటి వాసన వస్తే పాలు ఆ వాసనను గ్రహించి పులిసిన వాసన వస్తుంది. పాలు పితికిన వెంటనే శుభ్రమైన వస్త్రంతో వడకట్టాలి.
- రాత్రి తీసిన పాలతో తర్వాత తీసినవి కలపకూడదు. తాజా పాలు కొంచెం తియ్యని వాసన కలిగి ఉంటాయి.
- పాలల్లో ఎరుపు జీర, తరకలు కనిపిస్తే పశువుల్లో పొదుగు వాపు గాని, గాయం గాని ఉండి ఉండవచ్చు. వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి. పై నియమాలు పాటిస్తే లాభాలు పొందవచ్చు.

ఇదే జీవనాధారం



నాకు 10 పాడి గేదెలు ఉన్నాయి. ఇందులో 4 చూడివి కాగా, 6 పాలిచ్చే గేదెలు. పూటకు సుమారు 30 లీటర్ల పాల దిగుబడి రాగా, నాకు పాల సేకరణ కేంద్రం కూడా ఉంది. దీనిద్వారా పాడి రైతుల నుంచి 50 లీటర్లు సేకరించి రిటైల్‌గా వినియోగదారులకు విక్రయిస్తున్నాను. ఈ విధంగా పాల ఉత్పత్తి, పాల సేకరణ ద్వారా జీవనం సాగిస్తున్నాను.

–చోడపనీడి వీవీ సత్యనారాయణ, పాడి రైతు, వాడపాలెం, కొత్తపేట మండలం

శుభ్రంగా ఉంచాలి



పశువుల శాలలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలి. ముఖ్యంగా పశువులు వదిలిన మూత్రం అక్కడే నిల్వ ఉండకుండా పల్లానికి వెళ్లేలా శాలలో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలి. పాడి పశువుల పోషణలో జాగ్రత్తలు పాటిస్తే నాణ్యమైన అధిక పాల ఉత్పత్తి సాధించడంతో పాటు మంచి వెన్న శాతం వస్తుంది. తద్వారా లాభాలు పొందవచ్చు.

–ఎస్.మహేశ్వరరెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ, వైద్యాధికారి, ప్రాంతీయ పశు వైద్యశాల, రావులపాలెం

క్లుప్తంగా

రేపటి నుంచి 11 జిల్లాల అధికారులకు శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ)లో శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ, ఏలూరు జిల్లాలో జిల్లా స్థాయి అధికారులకు 5వ బ్యాచ్ శిక్షణ ఉంటుందని ఈటీసీ మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 9 లక్ష్యాలపై అవగాహన ఉంటుందన్నారు. ప్రతి బ్యాచ్‌కు ఒక అంశంపై శిక్షణ అందిస్తున్నామని అన్నారు. సోమవారం నుంచి బుధవారం వరకూ మూడు రోజుల పాటు 'మహిళా స్నేహపూర్వక గ్రామం' అనే అంశంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. మూడు రోజులు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ముమ్మిడివరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఐ.పోలవరం మండలం ఎదుర్లంకకు చెందిన లారీ డ్రైవర్ పితాని రామకృష్ణ (42) ఈ నెల 7న మోటారు సైకిల్‌పై అమలాపురం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ముమ్మిడివరం కొండాలమ్మ చింత బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా, కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. రామకృష్ణకు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఏఎస్సై పెద్దబ్బాయి మృతి



ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న పి.పెద్దబ్బాయి (60) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. రాజవొమ్మంగి మండలం లాగరాయికి చెందిన పెద్దబ్బాయి ఏలేశ్వరంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం అస్వస్థతకు గురికాగా కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గుండెపోటుతో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జిల్లా పోలీస్ యూనియన్ అధ్యక్షుడు పి.సత్యమూర్తి, అసోసియేషన్ సభ్యులు, ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్సై ఎం.పవన్‌కుమార్‌లు సంతాపం తెలిపారు.

కిక్కిరిసిన శృంగార వల్లభుని ఆలయం

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు బారులు తీరారు. శనివారం కావడంతో అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వివిధ సేవలు, టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా రూ. 2,97,678 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 18 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా, నాలుగు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


తిరుపతిలో శృంగార వల్లభస్వామి →


స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నం


గాయపడిన ప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ముందు శనివారం ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతని శరీరం కాలిపోవడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. దీనికి సంబంధించిన వివరాల్లోకెళితే.. స్థానిక లింగంపేటకు చెందిన ప్రసాద్ తన స్నేహితుడి వద్ద రూ.20 వేలు అప్పు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో అప్పు తీర్చమని అడుగుతున్నాడు. దీనికి ప్రసాద్ నుంచి సమాధానం లేకపోయేసరికి అతని ద్విచక్ర వాహనాన్ని తీసుకున్నాడు. దీంతో ప్రసాద్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన వాహనాన్ని ఇప్పించాలని పోలీసులకు తెలిపాడు. సాయంత్రం వస్తే సదరు వ్యక్తిని పిలిచి మాట్లాడతామని పోలీసులు వివరించారు. అయితే మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ పోలీసుల ముందు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీనిని చూసిన స్థానికులు, పోలీసులు అతనిని వెంటనే ప్రభుత్వాపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు బాలికల కిడ్నాప్

● వారి ఆచూకీ కోసం నాలుగు పోలీసు బృందాల ఏర్పాటు
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ

ధవళేశ్వరం: ఇద్దరు బాలికలను తెలిసిన వ్యక్తే కిడ్నాప్ చేశాడని, వారి ఆచూకీ కోసం నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్టు రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ శనివారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన ఓ మహిళ భర్తతో విడిపోయి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో కలిసి గత 8 సంవత్సరాలుగా ధవళేశ్వరంలో నివసిస్తోంది. ఆమె ఇద్దరు మైనర్ కుమార్తెలూ కాకినాడలో చదువుకుంటూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ ఏడాది మేలో వేసవి సెలవులకు ధవళేశ్వరంలోని తల్లి వద్దకు వచ్చి అక్కడే ఉంటున్నారు. మూడు నెలల క్రితం వెంకటేష్ అనే వ్యక్తి రైల్వేలో టీసీగా పనిచేస్తున్నాను అని చెప్పి వీరు ఉంటున్న ఇంటిపై పోర్షన్‌లో అద్దెకు దిగాడు. అతనితో పాటు ఒక 17 ఏళ్ల అమ్మాయి ఉంది. ఆమెను తన చెల్లి అని చెప్పేవాడు. ఇరుగు పొరుగు వారితో సన్నిహితంగా ఉంటూ ఆమె ఇద్దరు పిల్లలను మచ్చిక చేసుకుని వారి కుటుంబంతో సన్నిహితంగా ఉన్నాడు. బాలికల తల్లిని అక్క అని పిలిచేవాడు. ఆ కుటుంబాన్ని, పక్క పోర్షన్‌లో నివాసం ఉండే మరో ఇద్దరు పిల్లలను తీసుకుని, జూన్‌లో అరకు వెళ్లి మూడు రోజులు ఉండి వచ్చారు. అలాగే తిరుపతి వెళ్లి మూడు రోజులు ఉండి, విజయవాడ గుడికి వెళ్లి వచ్చారు. ఇలా ఆ కుటుంబానికి బాగా దగ్గరయ్యాడు.

ఉద్యోగం ఇప్పిస్తానని...

తల్లికి రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆమెను విజయవాడ తీసుకుని వెళ్లి రెండు వారాల పాటు అక్కడే ఉంచాడు. అనంతరం పిల్లవాడిని ఆమె దగ్గరకు చేర్చాడు. ఆమె కుమార్తెలు ఇద్దరినీ హాస్టల్‌లో దించుతానని చెప్పి గత నెల 21న ధవళేశ్వరం గ్రామం వచ్చాడు. ఇద్దరు పిల్లలను తల్లితో ఫోన్‌లో మాట్లాడించి హాస్టల్‌కి వెళ్తున్నామని చెప్పి గత నెల 22న ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లాడు. ఆ తర్వాత కూడా తాను ఒక్కడే విజయవాడ వెళ్లి ఆమెను కలిసి వచ్చాడు. గత నెల 28 నుంచి అతని ఫోన్ స్విచ్చాఫ్ కాగా తల్లికి అనుమానం వచ్చి గత నెల 29న ధవళేశ్వరం తిరిగి వచ్చింది. హాస్టల్ వారితో మాట్లాడి తన పిల్లలు హాస్టల్‌కు చేరుకోలేదని తెలుసుకుని గత నెల 30న ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు (విజయవాడ, గుంటూరు, కర్నూలు, నెల్లూరు, హైదరాబాద్, విజయనగరం జిల్లా) పంపారు. అలాగే రాజమహేంద్రవరం, ధవళేశ్వరం పరిసర ప్రాంతాలలో మూడు బృందాలతో విచారణ చేశారు. గత నెల 22వ తేదీ తర్వాత రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో ఒక రోజు, ఆ తర్వాత నెల్లూరులోని హోటల్‌లో ఒకరోజు ఆ పిల్లలు, వెంకటేష్ ఉన్నట్లుగా గుర్తించారు. గత నెల 28వ తేదీ సాయంత్రం 7 గంటల తర్వాత నుంచి గుంటూరు ప్రాంతంలో అతని ఫోను స్విచ్చాఫ్ అయినట్టు పోలీసులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు ఆమె తల్లికి తెలియపరిచారు. ఆమె కూడా తరచుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి కేసు దర్యాప్తు వివరాలను తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ దిశానిర్దేశం ప్రకారం రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ ఎం. అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ వినయ్ మోహన్, ఎస్సై హరికృష్ణ బృందం ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కిడ్నాప్‌కు గురైన బాలికలు, నిందితుడి ఫొటోలను విడుదల చేశారు. వారి ఆచూకీ తెలిసిన వారు 94407 96586, 94907 60791 నంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ అంబికాప్రసాద్ కోరారు.


నిందితుడు వెంకటేష్

అలరించిన బాలోత్సవం



బాలోత్సవంలో బాలికల నృత్య ప్రదర్శన

కొత్తపేట: విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో నైపుణ్యం పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కోనసీమ బాలోత్సవం మొదటి పిల్లల పండుగ పేరిట రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను శనివారం ప్రారంభించారు. మనం ట్రస్ట్, జితేంద్ర సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సత్యనారాయణ, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్దేశించేది పాఠశాలలేనని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే నానుడితో కోనసీమ బాలోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నప్పటి నుంచే విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటల్లో ఆసక్తి కలిగించాలని, తద్వారా వారిలో నైపుణ్యాన్ని వెలికితీయాలని సూచించారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విచిత్ర వేషధారణ, కోలాటాలు, నాట్య ప్రదర్శనలు, లఘు నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్రకుమార్, కోనసీమ బాలోత్సవ అధ్యక్షుడు కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఇన్‌చార్జి యండూరి పవన్, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబులను అభినందించారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్, మందపల్లి మాజీ సర్పంచ్ చింతం విజయకృష్ణ మోహన్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి సూర్యచంద్రరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మత్తు మందు ఇచ్చి చోరీ

కాకినాడ క్రైం: కాకినాడ గాంధీనగర్‌లో వృద్ధురాలు ఓ మహిళ చేతిలో మోసానికి గురైంది. పెద్దమ్మగారు అంటూ పంచన చేరిన ఆ మహిళ జ్యూస్‌లో మత్తు మందు కలిపి వృద్ధురాలికి ఇచ్చి బంగారంతో ఉడాయించింది. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ గాంధీనగర్‌కు చెందిన వంగా మణి (79) ఇంట్లో ఒంటరిగా జీవిస్తుంది. ఆ విషయాన్ని గమనించిన ఓ మహిళ కొద్ది రోజులుగా మీ పొరుగునే ఉంటున్నానంటూ మాట కలిపింది. చేదోడువాదోడుగా ఉంటుండడంతో మణి ఆమెను నమ్మింది. ఈ క్రమంలో గత నెల 24న ఉదయం పెద్దమ్మగారు మీరు చాలా నీరసంగా ఉన్నారంటూ అభిమానం కురిపించి వృద్ధురాలి ఇంట్లో ఉన్న బీట్‌రూట్‌తో జ్యూస్ చేసి ఇచ్చింది. ఆ జ్యూస్‌లో మత్తు మందు కలిపి మణితో తాగించింది. ఆమె మత్తులోకి జారిన తర్వాత ఇంట్లో ఉన్న 64 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకెళ్లిపోయింది. మూడు రోజుల పాటు ఆ వృద్ధురాలు మత్తులోనే ఉంది. మూడు రోజుల తరువాత 27న లేచి చూసే సరికి ఆ మహిళ ఇచ్చిన జ్యూస్, అది తాగిన తర్వాత మత్తులోకి వెళ్లానన్న విషయం గుర్తొచ్చింది. కంగారుగా బీరువా వెతికేసరికి అందులో ఉన్న బంగారం చోరీకి గురైందన్న విషయం గుర్తించింది. ఇప్పటివరకూ ఆమె కోసం గాలించినా ఫలితంలేక పోలీసులను ఆశ్రయించింది.

వెనుక బడి.. ఎదురుగా గుడి

● కూటమి ప్రోద్బలంతో తెరుచుకున్న పేకాట క్లబ్
● పోలీసుల దాడి.. టీడీపీ నేతల పైరవీలు

అమలాపురం టౌన్: కొన్నేళ్లుగా మూతపడిన అమలాపురం జార్జి రిక్రియేషన్ క్లబ్ కూటమి నేతల ప్రోద్బలంతో మళ్లీ తెరుచుకుంది. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి కూడా కొందరు నేతలకు వత్తాసు పలకడంతో క్లబ్ శుక్రవారం రాత్రి తెరుచుకునే ఏర్పాట్లు జరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేకాట క్లబ్‌లకు ఎంత మాత్రం అవకాశం లేకపోవడంతో అవి మూతపడ్డాయి. అయితే శనివారం ఆ క్లబ్‌లో పేకాట ఆడుతున్న సమయంలో పోలీసులు మెరుపు దాడి చేశారు. కొందరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే టీడీపీ నేతలు కొందరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసు నమోదుకు ససేమిరా అంటూ పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. శనివారం అర్ధరాత్రి పొద్దుపోయే వరకూ కొందరు నేతలు పట్టణ పోలీస్ స్టేషన్ వద్దే ఉండి పోలీసులతో మంతనాలు జరిపారు. నేతల ఒత్తిడి, పైరవీలతో కేసు నమోదు చేస్తారా.. లేదా అనే సందేహాలు ప్రజల్లో నెలకొంది. ప్రజాప్రతినిధి ఇచ్చిన అభయమే అనధికార అనుమతిగా భావించి కొందరు కూటమి నేతలు క్లబ్ తెరిచి బరి తెగించి మరీ పేకాటకు తెర తీశారు.


అమలాపురంలో మళ్లీ తెరుచుకున్న జార్జి రిక్రియేషన్ క్లబ్ భవనం ఇదే..

అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేది లేదని జిల్లా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రకటనలతో ఊదరకొడుతుంటే ఈ పేకాట క్లబ్‌కు ఎలా అనుమతి ఇచ్చారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దాడి చేసిన పోలీసులు పేకాటపై కేసు నమోదు చేస్తే సరేసరి. లేని పక్షంలో పోలీసులు కూటమి నేతల ఒత్తిళ్లకు గురయ్యారనే అనుమానాలు బలపడతాయి. ఈ క్లబ్ భవనం వెనుకే ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఎదురుగా వినాయక గుడి ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు గుడి, బడి నిబంధనలు వర్తిస్తాయి. ఆ నిబంధనలను కూటమి నేతలు తుంగలో తొక్కి మరీ క్లబ్ తెరవడంపై విమర్శలకు దారి తీస్తోంది. ఏదేమైనా ఇది ఎంతవరకూ వెళ్తుందో వేచి చూడాల్సిందే.

జోస్ అలుక్కాస్‌లో ఖాతాదారులకు బహుమతులు



వేడుకలను ప్రారంభిస్తున్న సత్యదేవ నర్సరీ చైర్మన్ పుల్లా వెంకట్రావు

రాజమహేంద్రవరం సిటీ: జోస్ అలుక్కాస్ సంస్థ ఏర్పడి 60 ఏళ్లు పూర్తవడం ఆనందదాయకమని సత్యదేవ నర్సరీ చైర్మన్ పుల్లా వెంకట్రావు కొనియాడారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం బ్రాంచ్‌లో వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి వేడుకలను మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. షోరూమ్ మేనేజర్ జియో మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కస్టమర్లకు రూ.6 కోట్ల విలువైన బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఆరు కార్లను లక్కీడిప్ తీసి విజేతలకు ఇస్తామన్నారు. ఆరు వారాల వేడుకల్లో ప్రతి వారం లక్కీడిప్ ద్వారా అనేక గృహోపకరణాలను అందజేస్తామన్నారు. ప్రతి కొనుగోలుపై ఒక గ్యారెంటీ గిఫ్ట్ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్తీక్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.